క్లుప్తంగా

రీ-సర్వే ప్రక్రియ పరిశీలన



నార్నెపాడులో రీ-సర్వేపై సూచనలిస్తున్న సర్వేయర్ ఏడుకొండలు

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు, లంకెలకూరపాడు, పలు గ్రామాల్లో జరుగుతున్న భూ రీ-సర్వే ప్రక్రియను తహసీల్దార్ ఎం.భవాని శంకర్, మండల సర్వేయర్ యు.ఏడుకొండలు గురువారం పరిశీలించారు. రోజుకు ప్రతి గ్రామంలోనూ 50 ఎకరాలకు తగ్గకుండా సర్వే పూర్తి చేయాల్సి ఉందని సర్వేయర్ తెలిపారు. రైతులు సర్వే బృందం సభ్యులకు భూ ముల హక్కు పత్రాలను, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలను అందించి సహకరించాలని కోరారు. సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

సత్తెనపల్లిలో 2,30,684 మంది ఓటర్లు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): సత్తెనపల్లి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,30,684లుగా నమోదైనట్లు తహసీల్దార్ కె.నగేష్ గురువారం తెలిపారు. గతేడాది నవంబర్ నాటికి 2,35,876 ఓటర్లు ఉండగా సవరించిన ఓటరు జాబితా ప్రకారం 5,192 ఓట్లు తగ్గినట్లు ఆయన తెలిపారు. ఇటీవల చేపట్టిన ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా తుది జాబితా సిద్ధం చేశామన్నారు. సత్తెనపల్లి పట్టణంలో 46,171, సత్తెనపల్లి రూరల్‌లో 58,691, రాజుపాలెం మండలంలో 40,599, నకరికల్లు మండలంలో 50,921, ముప్పాళ్ళ మండలంలో 34,302 మంది ఓటర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పెదకూరపాడు: ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పెన్షన్ మహోత్సవాల్లో భాగంగా నూతనంగా మంజూరైన పింఛన్లను శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో నరసింహరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ముగ్గురు రాజులు' మహోత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

8వ వార్డులో..2వ ఆధార్ సేవా కేంద్రం

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పట్టణంలోని భవిరిశెట్టివారి వీధిలోని 8వ వార్డు సచివాలయంలో రెండవ ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభించినట్లు మున్సిపల్ కమిషనర్ షమ్మీ గురువారం తెలిపారు. ఈ కేంద్రం ద్వారా 0 నుంచి 15 సంవత్సరాల వయసు గల పిల్లలకు కొత్త కార్డు నమోదు, 5 నుంచి 15 సంవత్సరాల గల పిల్లలకు ఫింగర్ ప్రింట్స్, ఐరిష్ అప్డేట్, సవరణలు లాంటి అన్నీ సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. 2, 8వ వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పట్టణ, పరిసర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

బెల్లంకొండ: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎల్.సుధీర్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూగ జీవాలను హింసించడం, జూదం చట్టరీత్యా నేరమన్నారు. మండలంలో కోడి పందేలు నిర్వహించే వారి వివరాలను పోలీసులకు తెలియజేయాలని కోరారు. తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. అదే విధంగా పండుగ సందర్భంగా గ్రామాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయదలుచుకున్నవారు ముందస్తుగా పంచాయతీ, పోలీసు శాఖల అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. లేకపోతే.. చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

చర్చి స్థలంపై దావా కొట్టివేత

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పట్టణంలోని గుంటూరు ప్రధాన రహదారికి పక్కనే ఉన్న ఏబీఎం ఆస్తులపై దాఖలైన దావాను సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు గురువారం కొట్టివేసినట్లు బాగ్స్ మెమోరియల్ తెలుగు బాప్టిస్టు చర్చి తరుపున న్యాయవాది చిలుకా చంద్రశేఖర్ తెలిపారు. 2012లో తెలుగు బాప్టిస్టు చర్చికి చెందిన స్థలం(శిలువ శిఖరం)ను అక్రమంగా కొనుగోలు చేసినట్లుగా కాకర్ల రామారావు, తన సహచరులు పత్రాలు సృష్టించి స్వాధీనం చేసుకునేందుకు యత్నించారని ఆయన తెలిపారు. వారి ప్రయత్నాన్ని సంఘ సభ్యులు అడ్డుకోవటంతో గుంటూరు అదనపు సబ్ కోర్టును ఆశ్రయించి పర్మినెంట్ ఇంజెక్షన్ దాఖలు చేశారని పేర్కొన్నారు. అనంతరం దావా సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ కావటం, పదేళ్ల పాటు వాద ప్రతివాదనలు జరిగాయన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ స్వాధీనం కోరుతూ దాఖలైన దావా ఏబీఎం చర్చి సంరక్షకులకు అనుకూలంగా ఇస్తూ ప్రతివాది దావాను డిస్మిస్ చేస్తూ తీర్పు వెల్లడించినట్లు ఆయన తెలిపారు. చర్చికి అనుకూలంగా తీర్పు రావటంతో సంఘ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం జగన్ రియల్ హీరో..

- నారా చంద్రబాబు నాయుడు.. డూప్
- నియోజకవర్గంలో పెరిగిన పింఛన్‌దారులు 9వేల మంది
- నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేట: ఎన్నికల వాగ్దానాలన్నింటినీ అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రియల్ హీరో అని, హామీలను అమలు చేయలేక గ్రాఫిక్స్‌లో అభివృద్ధిని చూపించిన ప్రతిపక్ష నేత చంద్రబాబు డూప్ అని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అభివర్ణించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 320 మందికి నూతన పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం సభ వద్ద సీఎం చిత్రపటానికి పింఛన్‌దారులతో కలసి క్షీరాభిషేకం చేశారు. పెదకూరపాడు నియోజకవర్గంలో 2019కి ముందు 29,910 మంది పింఛన్‌దారులుండగా..వారికిచ్చిన పింఛన్ నగదు మొత్తం రూ.3.07 కోట్లు ఉండేదని ఎమ్మెల్యే శంకరరావు తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక మూడున్నరేళ్లలో 9 వేల మందికి అదనంగా పింఛన్లు పెంచినట్లు వెల్లడించారు. ప్రస్తుతం 38,344మంది పింఛన్ పొందుతున్నారని, వారికి ప్రతి నెలా రూ.10.59కోట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. గతంలో కొత్త పింఛను మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీల సిఫార్సుతో లంచాలు సమర్పించుకోవాల్సి దుస్థితి ఉండేదని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. ప్రస్తుతం కులాలు, మతాలు, పార్టీలు, వర్గాలతో పని లేకుండా అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేసి, వలంటీర్లతో ప్రతి నెలా ఒకటవ తేదీన ఉదయాన్నే తలుపు తట్టి.. పింఛన్ నగదు పంపిణీ చేస్తున్నామన్నారు. మంచి చేసే వారిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కరోనాతో ప్రపంచం మొత్తం అతలాకుతలమై, ఆర్థికంగా దయనీయ స్థితిలో ఉన్నా.. ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా నిరవధికంగా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డిదేనని గుర్తించాలన్నారు. గ్రామాల్లో సమస్యలన్నింటినీ పరిష్కరించాం కనుకనే గడప గడపకు నిర్భయంగా తిరగ గలుగుతున్నామన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత అమరావతి నుంచి తుళ్లూరుకు, అచ్చంపేట నుంచి కొండూరుకు, చింతపల్లి నుంచి పుట్లగూడెం వరకు రోడ్లు వేయించినట్లు తెలిపారు. అమరావతి నుంచి బెల్లంకొండకు డబుల్ రోడ్డు వేయిస్తున్నానన్నారు. మాదిపాడు వద్ద కృష్ణా నదిపై బ్రిడ్జి నిర్మాణానికి సీఎం వచ్చే నెలలో శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ స్థాయిలో అభివృద్ధి ఎప్పుడైనా జరిగిందా అని ప్రశ్నించారు. గతంలో 10 ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా ఉన్న శ్రీధర్ ఒక్క అభివృద్ధి పనైనా చేశాడా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణా నాయక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, ఉప ఎంపీపీ గంగసాని బాబు, గ్రామ సర్పంచులు కంభాల వీరబాబు, కిక్కురు అర్లారెడ్డి, మాజీ సర్పంచ్ తుమ్మా చిన్నపరెడ్డి, ఎంపీటీసీ తెల్లమేకల నాగరాజు, వ్యవసాయ యూనివర్శిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, లీడ్ క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, వీఆర్వోలు, గ్రామ సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమర్థుడైన నాయకుడిని ఎన్నుకోండి

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గ ప్రజల కోసం నిత్యం కష్టపడే మనిషి, ఏదైనా సాధించగల సమర్థుడు అనే నాయకుడ్ని ఎన్నుకోవాలని, అంతేకాని నయా పైసా పనిచేయని వారిని ఎన్నుకోవద్దని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పెదకూరపాడు నియోజవర్గానికి మూడున్నర సంవత్సరాల కాలంలో సుమారు రూ.1,100 కోట్ల పైగా నిధులు మంజూరయ్యాయని, అదంతా సీఎం జగన్ మోహన్‌రెడ్డి సహకారంతోనే సాధించగలిగానని తెలిపారు. పదేళ్ల పాలన చేసిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే నయా పైసా పనులు చేశారా..? అని ప్రశ్నించారు. శ్మశానాల ప్రహరీలు కట్టి ఆయన పేరు పెట్టుకోవటం మినహా ఏమైనా చేశారా.. అని ప్రజల్ని అడిగారు. గత కాంగ్రెస్, టీడీపీ పాలనలో క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు సొంత భవనాల నిర్మాణం కోసం ఏమైనా కృషి చేశారా..? అందులో మన పిల్లలు చదువుకోరా..? అది మన పనికాదా అని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనానికి స్థలం సేకరించి నిర్మాణాలు పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. పెదకూరపాడు నియోజవర్గంలో ఐదు మండలాల్లో రైతులకు కావాల్సిన ఎత్తిపోతల పథకాలు మరికొన్ని చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ముందుగా నూతన పింఛన్ లబ్ధిదారులతో సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండలంలో మంజూరైన 273 పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం రూ.7.2 కోట్లతో అమరావతి రోడ్డులో నిర్మిస్తున్న క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణ పనులను పర్యవేక్షించారు. త్వరగా మౌళిక వసతులతో భవన నిర్మాణం పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.శివరామయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా, సర్పంచ్ మల్లా చందమామ, క్రోసూరు ఉప సర్పంచ్ షేక్ మస్తాన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, గార్ల పాటిదాసు, షేక్ గఫూర్, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, గల్లాగురుపాదం,డాక్టర్ షరీఫ్, వేణుగోపాలరెడ్డి, మర్రిశ్రీనివాసరెడ్డి, సయ్యద్ అబ్దుల్‌రహీం, ప్రజాప్రతినిధులు, మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

క్రోసూరు ఏడీఏ వి.హనుమంతరావు



రైతులకు అవగహన కల్పిస్తున్న ఏడీఏ, అధికారులు

బెల్లంకొండ: వరి, మొక్కజొన్న పంటల సాగులో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలని క్రోసూరు ఏడీఏ వి.హనుమంతరావు తెలిపారు. గురువారం మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సౌజన్యంతో రైతులకు సాగు విధానాలపై అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ డిప్యూటీ పీడీ రామాంజనేయులు మాట్లాడుతూ వరిలో నారుమడి యాజమాన్యం, చదరపు మీటర్‌లో 44 కుదుళ్ల ఉండేలా నాట్లు వేయాలని, భాస్వరం ఎరువులు, నాట్లు యూరియా చల్లకం, కలుపు యాజమాన్యంపై అవగహన కల్పించారు. ఏడీఏ హనుమంతరావు ఎలుకల నివారణ, మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులపై వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కరిముల్లా బాబూజీ, ఏఓ కృష్ణయ్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తురకా ఏడుకొండలు, రజని తదితరులు పాల్గొన్నారు.

'ముగ్గురు రాజులు' మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

నేడు గుంటూరు పీఠాధిపతులు ఆధ్వర్యంలో దివ్య పూజ బలి



విద్యుత్ దీపాల కాంతులతో పాటిబండ్లలోని ముగ్గురు రాజులు దేవాలయం

పెదకూరపాడు: పాటిబండ్ల గ్రామంలోని ముగ్గురు రాజులు దేవాలయం తిరునాళ్లకు సిద్ధమైంది. తిరునాళ్లను తిలకించేందుకు ప్రపంచంలోని నలు మూలల నుంచి అనేక మంది మత గురువులు, మతకన్యలు ఇప్పటికే ఇక్కడికి చేరుకున్నారు. ఆదర్శ వంతమైన సంఘంగా, విశ్వాసానికి ప్రతీకగా పాటిబండ్లలో నిర్మించిన ముగ్గురు రాజులు దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. హోలెండ్‌లోని మిల్‌హిల్ సభకు చెందిన మత గురువు ఫాదర్ గ్లెస్‌మాన్ 1921లో ఈ గ్రామాన్ని సందర్శించారు. ఆ క్రమంలో ఇక్కడ ముగ్గురు రాజులు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. ఆలయంలో శిల్పకళలు చూపరులను కట్టిపడేస్తాయి. ఈ నెల 1 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు 5, 6, 7 తేదీలతో ముగుస్తాయి. జనవరి ఒకటి నుంచి ప్రత్యేక దివ్యపూజ బలి నిర్వహించారు.

రొమన్ కేథలిక్‌లకు ఆధ్యాత్మిక గ్రామం

పాటిబండ్ల రొమన్ కేథలిక్‌ల ఆధ్యాత్మిక గ్రామంగా పేరుంది. ఈ గ్రామానికి చెందిన 48 మంది ఫాదర్లు, 130 మంది మతకన్యలు ఆంధ్రప్రదేశ్‌లోనే కాక వివిధ రాష్ట్రాలు, ఇతర దేశాల్లో నిరంతరం దేవుని సేవలందిస్తున్నారు. ఆధ్యాత్మికంగానే కాక సమాజ సేవ లో తమ వంతు సాయం అందిస్తున్నారు. శుక్రవారం నిర్వహించే ఈ మహోత్సవంలో గుంటూరు పీఠాధిపతులు రెవరెండ్ చిన్నాబత్తిన భాగ్యయ్య హాజరై ప్రత్యేక దివ్య పూజలు నిర్వస్తారని విచారణ గురువులు చిన్నాబత్తి హృదయకుమార్, సహాయ గురువు నందిగం సురేష్ తెలిపారు. మహోత్సవం సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాల తో అలంకరించారు. సీఐ వీరాస్వామి ఆధ్వర్యంలో బందొబస్త్ నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరో 8 మందికి గాయాలు
- పసుపులేరు బ్రిడ్జివద్ద ఘటన



ఘటనా స్థలంలో ఆర్టీసీ బస్సు, లారీ

వినుకొండ(నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తిమృతి చెందగా మరో 8 మందికి తీవ్రగాయాలైన ఘటన మార్కాపురం రోడ్డులోని పసుపులేరు బ్రిడ్జివద్ద గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... యర్రగొండపాలెం నుంచి నూజివీడు వెళుతున్న ఆర్టీసీ బస్సు నరసరావుపేట నుంచి త్రిపురాంతకం వెళుతున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముందు వెళుతున్న ద్విచక్రవాహనం లారీ కిందపడింది. ఈ ప్రమాదంలో చింతలచెర్వు గ్రామానికి చెందిన మాల్యాద్రి (50) అక్కడిక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై ఉన్న మరోవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. లారీలో ప్రయాణిస్తున్న వ్యక్తులకు గాయాలయ్యాయి.

క్షతగాతుల్రను 108 వాహనం ద్వారా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడలిపై అత్త, మామ దాడి

నరసరావుపేట టౌన్: కోడలిపై అత్త, మామ రోకలి బండతో దాడికి పాల్పడిన ఘటన గురువారం పట్టణంలో జరిగింది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాష్ నగర్‌కు చెందిన ఎన్.రమ్యపై అత్త, మామ మరియమ్మ, ఆదయ్య రోకలిబండతో దాడికి పాల్పడ్డారు. కుటుంబ వివాద నేపథ్యంలో దాడి చేసినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు.

ఉరి వేసుకొని వివాహిత మృతి

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందిన ఘటన సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. క్రోసూరుకు చెందిన జొన్నలగడ్డ సురేఖ(35)ను సత్తెనపల్లి మండలం నందిగామకు చెందిన జొన్నలగడ్డ సురేష్ 14 సంవత్సరాల క్రితం వివాహం చేసుకొన్నాడు. వీరికి ముగ్గురు సంతానం. కుటుంబంలో తరచూ అత్త, కోడలు మధ్య వివాదాలు జరగుతున్నాయి. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి సురేఖ ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి సోదరుడు ఎం.కోటేశ్వరరావు ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ ఎ.బాలకృష్ణ తెలిపారు.

మహిళపై దాడి

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పాతకక్షల నేపథ్యంలో మహిళపై కర్రతో దాడి చేసి గాయపరిచిన ఘటన పట్టణంలోని వడ్డవల్లిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వడ్డవల్లికి చెందిన చేజర్ల శ్రీనివాసరావుకు, అతని చెల్లెలు నల్లబోయిన కోటేశ్వరమ్మకు మధ్య కొంత కాలంగా వివాదం నెలకొంది. ఈ క్రమంలో గేదెలు తోలుకొని పొలం నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో మరలా ఇరువురి మధ్య వాగ్వివాదం జరిగింది. అది కాస్త ముదిరి కోటేశ్వరమ్మపై శ్రీనివాసరావు కర్రతో దాడి చేసి, గాయపరిచాడు. గాయపడిన కోటేశ్వరమ్మను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. జరిగిన ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ శోభన్‌బాబు తెలిపారు.

నీరు, పారిశుధ్యంపై అవగాహన

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో గురువారం జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారికి నీరు, పారిశుధ్యంపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జలజీవన్ మిషన్ మండల కో-ఆర్డినేటర్ బాబూరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా ప్రజలకు సురక్షితమైన మంచి నీటిని అందించేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ మిషన్ ద్వారా ప్రతి గ్రామం ప్రతి మనిషికి ప్రతిరోజు 55 లీటర్ల మంచినీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామస్తులు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సురక్షితమైన మంచినీటిని త్రాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఓలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే రౌడీషీట్ తెరుస్తాం

జూదరులను హెచ్చరించిన డీఎస్పీ

నరసరావుపేట రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ విజయ భాస్కరరావు హెచ్చరించారు. జూదరులకు గురువారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. నరసరావుపేట, రొంపిచర్ల మండలాల పరిధిలో గతంలో కోడిపందేలు నిర్వహించిన వారు, పందెపు కోడి పుంజులు పెంపకందార్లు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ విజయ భాస్కరరావు మాట్లాడుతూ కోడిపందేలు నిర్వహించినా, కోడికత్తులు తయారు చేసి విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. కోడిపందెం జూదం లాంటిదని, దీని బారిన పడి అనేక కుటుంబాలు నాశనమవుతున్నాయని తెలిపారు. సంక్రాంతి పండుగను అందరూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటున్నామన్నారు. జూదాలు, కోడిపందేలపై సిబ్బందితో గ్రామాల్లో నిఘా పెట్టినట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్ఐలు బాల నాగిరెడ్డి, హజరత్తయ్య, సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



24వ వార్డులో పోటీలను పరిశీలిస్తున్న కౌన్సిలర్లు



నకరికల్లు: ముగ్గుల పోటీలు తిలకిస్తున్న మండల కన్వీనర్ రాఘవరెడ్డి, నాయకులు



నకరికల్లు: నర్శింగపాడు గ్రామంలో రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు



విజేతలను ప్రకటిస్తున్న డాక్టర్ గీతా హాసంతి, పక్కన నాయకులు

ముప్పాళ్ళ: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో వైఎస్సార్ గ్రామీణ ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. సత్తెనపల్లి పట్టణంలోని 1, 2, 11, 12, 21, 22, 23, 24 వార్డుల్లో గురువారం ముగ్గుల పోటీలు జరిగాయి. పోటీలను ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డా.గీతా హాసంతి, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఎం.కంఠేశ్వరి, గుజ్జర్లపూడి సతీష్, లోక కళ్యాణి, అచ్యుత శివప్రసాదు, కాకుమాను రవిబాబు, శెట్టి ఆనంద్, ఆకుల రమేష్, వరికల్లు కోటేశ్వరరావు పర్యవేక్షించారు. పోటీల్లో వార్డు స్థాయి విజేతలకు బహుమతులు అందించారు.

ముప్పాళ్ళ మండలంలో..

మండలంలోని దమ్మాలపాడు, కుందురువారిపాలెం గ్రామాల్లో వైఎస్సార్ గ్రామీణ ముగ్గుల పోటీలు జరిగాయి. పోటీలను సర్పంచ్ వెంకటప్పారెడ్డి, ఉపసర్పంచ్ కుందురు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పర్యవేక్షించారు. పోటీల్లోని విజేతలకు బహుమతులు అందించారు.

సత్తెనపల్లి మండలంలో..

మండలంలోని కంటెపూడి, నందిగామ, గుడిపూడి, ఫణిదం, గుజ్జర్లపూడి, గండ్లూరు, భృగుబండ, గర్నెపూడి గ్రామాల్లో వైఎస్సార్ గ్రామీణ ముగ్గుల పోటీలు జరిగాయి. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తం, రైతుసంఘం సలహా మండలి సభ్యుడు కళ్ళం విజయభాస్కరరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పర్యవేక్షించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

నకరికల్లు: ఆచార సంప్రదాయాలు ఉట్టిపడేలా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని దేచవరం, నర్శింగపాడు, తురకపాలెం, చేజర్ల, కుంకలగుంట తదితర గ్రామాల్లో వైఎస్సార్ సంక్రాంతి ముగ్గుల పోటీలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అధిక సంఖ్యలో మహిళలు తెలుగుదనం ఉట్టిపడేలా రంగవల్లులు తీర్చిదిద్దారు. ముగ్గుల పోటీలను తిలకించిన మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి మాట్లాడుతూ.. పాల్గొన్న ప్రతి మహిళలకు మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వైఎస్సార్ గ్రామీణ ముగ్గుల పోటీలు

రాజుపాలెం: మండలంలోని పలు గ్రామాలలో వైఎస్సార్ గ్రామీణ ముగ్గుల పోటీలను గురువారం నిర్వహించారు. ఈ పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. బీరవల్లిపాయ, బలిజేపల్లి, చౌటపాపాయపాలెం, కొత్తూరు, కొత్తబోధనం, ఇనిమెట్ల, రెడ్డిగూడెం, రాజుపాలెం, ఉప్పలపాడు తదితర గ్రామాలలో మహిళలు రంగవల్లులు దిద్దేందుకు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామానికి ఐదుగురు చొప్పున విజేతలను ఎంపిక చేశారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా ముగ్గుల పోటీలను ముందుండి నిర్వహిస్తున్న మహిళా సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ గీతాహాసంతి, రాజుపాలెం, రెడ్డిగూడెం తదితర గ్రామాలలో జరిగే ముగ్గుల పోటీలను తిలకించి విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, సర్పంచ్ పులిబండ్ల అశోక్, తోట లక్ష్మీనారాయణ, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, ఆర్‌బీకేల సలహా మండలి చైర్మన్ కేదారి నాగేశ్వరరావు, ఎస్కే జానీ, ఎస్కే బాషా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సంక్షేమ పాలన అందిస్తున్నాం

- స్థానికతను ప్రశ్నించేవాళ్లు.. అభివృద్ధిపై చర్చకు రావాలి
- 'గడప గపడకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



మహిళలకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అమరావతి: ఏ దశలోనూ అవినీతికి తావులేకుండా అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుస్తున్న జననేత సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి అని పెదకూరపాడు శాసన సభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. గురువారం అమరావతి 1వ సచివాలయ పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చిన్న చిన్న సమస్యలను ఎమ్మెల్యే శంకరరావు దృష్టికి తీసుకురావటంతో అయన వెంటనే తన వెంట ఉన్న అధికారులను సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆదేశించారు. అమరేశ్వరాలయంలోని జ్వాలాముఖి అమ్మవారికి పూజలు చేసి పూజారి వీధి నుంచి 1, 2వ వార్డులలో ప్రజల సమస్యలు వింటూ వాటికి అధికారులతో చర్చించి వెంటనే పరిష్కారాలను సూచిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ.. పార్టీలు, వర్గాలు, కుల మతాలు చూడకుండా అర్హతతోనే లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని గర్వంగా ఇంటింటికీ తిరిగి చెబుతున్నామన్నారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి, తాము మూడున్నరేళ్లలో చేసిన అభివృద్ధిపై ఎక్కడ చర్చించటానికైనా తాను సిద్ధమన్నారు. మాజీ శాసనసభ్యుడు స్థానికతను తెరపైకి తెస్తున్నాడని స్థానికుడై ఉండి అయన ఏమాత్రం అభివృద్ధి చేశాడో చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఆయన సొంత గ్రామంలోనే మూడున్నరేళ్లలో సుమారు రూ.10కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేయడం వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. దళారీ వ్యవస్థ లేకుండా పారదర్శకంగా ఇన్ని అభివృద్ధి సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డిదేనన్నారు. ప్రతిపక్షాల విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. వారికి ప్రజల అభివృద్ధి, సంక్షేమం పట్టదని సీఎం జగన్మోహనరెడ్డిని విమర్శించడం ఒక్కటే పనిగా పెట్టుకున్నారన్నారు.

అమరావతిలో రూ.17కోట్లతో సంక్షేమాభివృద్ధి

మూడున్నరేళ్లలో అమరావతిలో అర్హులైన లబ్ధిదారులకు రూ.17కోట్ల సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు అందించామని, అలాగే 513మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని ఎమ్మెల్యే శంకరరావు తెలిపారు. ఈకార్య క్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కోట హరిబాబు, జెడ్పీటీసీ ఈదుపుగంటి కరుణకుమారి, జెడ్పీ కో-అప్షన్ మెంబర్ షేక్ హష్మీ, మండల పార్టీ అధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ పాలపర్తి రాజేశ్వరి ఉప సర్పంచ్ నిమ్మా విజయసాగర్‌బాబు, ఎంపీటీసీ గుడిశె అనూషా, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సూట్స్‌కేర్‌తో నిప్స్ ఒప్పందం

నరసరావుపేట రూరల్: సూట్స్ కేర్ నెట్‌వర్క్‌తో నరసరావుపేట ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (నిప్స్) ఒప్పందం కుదుర్చుకున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జేఎన్ సురేష్ కుమార్ తెలిపారు. కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సూట్స్ కేర్ నెట్‌వర్స్ ఏహెచ్‌సీ విభాగం డైరెక్టర్ వై.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ జేఎన్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో అఫడబుల్ హెల్త్‌కేర్ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు డాక్టర్ సోమశేఖరరెడ్డి తొమ్మిది సంవత్సరాల క్రితం సూట్స్ కేర్ నెట్‌వర్క్‌ను ప్రారంభించి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ జేఎన్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో సూట్స్‌కేర్ నెట్‌వర్క్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నిప్స్ కళాశాల జీఈడీఎస్ డైరెక్టర్ కిశోర్‌బాబు, ఫార్మా డి.ఇన్‌చార్జ్ భవ్యసాయి, సూట్స్‌కేర్ నెట్‌వర్క్ ప్రమోషన్ టీం ఇన్‌చార్జ్ కృష్ణ దేశ్‌ముఖ్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.